వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 6 : ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్ రావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం నూతనంగా ఎంపికైన పోలీస్ సిబ్బందికి 15 రోజులు అందించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పోలీస్ దారుఢ్యం, మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా కోసం ఈ ప్రత్యేక శిక్షణ ఎంతో ఉపయోగపుతుందన్నారు. ఈ శిక్షణ దశలవారీగా ఉంటుందని, ఇందులో భాగంగా మొదటి దశలో 56 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీవో అంజన్న, ఆర్ఐఎస్ఐలు కిరణ్, సందీప్, రాజేశ్, లవన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జైనూర్, డిసెంబర్ 6 : పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జీసీడీవో శకుంతల పేర్కొన్నారు. జైనూర్ మండలం రాసిమెట్ట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంతోపాటు, ఆరోగ్య విషయంలో తగు జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాషిమెట్ట, పట్నాపూర్ పాఠశాలల హెచ్ఎంలు అనిత, అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాసిమెట్ట ఆశ్రమ పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న జీసీడీవో

పులి సంచారం తెలిస్తే సమాచారమివ్వండి

కెరమెరి, డిసెంబర్ 6 : అటవీ సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కెరమెరి ఎఫ్ఆర్వో సయ్యద్ మజారుద్దీన్ సూచించారు. మండలంలోని మారుమూల నిషాని గ్రామాన్ని శుక్రవారం సందర్శించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిషాని గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో మజారొద్దీన్

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

మందమర్రి, డిసెంబర్ 6 : ఏరియాలోని కాసీపెట-1, 2 గనుల్లో తరచూ గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. 250 మంది ఉద్యోగులు హాజరుకావాల్సి ఉండగా, 100 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా దవాఖాన వైద్యురాలు జయవాణి, డీవైపీఎం విశ్రాంత్, ఏఐటీయూసీ నాయకుడు బానయ్య, సింగరేణి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కోసం..

క్వార్టర్ల కోసం సీఈఆర్ క్లబ్‌లో ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల ఉద్యోగులకు 99 క్వార్టర్లను ప్రకటించగా, 130 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 29 మందికి కేటాయించారు. డీవైపీఎం మైత్రేయబంధు, ఓఎస్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

బెల్లంపల్లి, డిసెంబర్ 6 : పట్టణంలోని కన్నాల బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ఆవిష్కరించారు. బస్తీకి చెందిన గజ్జెల రాంనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంటాచౌరస్తాను అంబేద్కర్ చౌరస్తాగా మార్చుతూ ఏర్పాటు చేసిన నామకరణ బోర్డును మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థిని తో ప్రిన్సిపాల్

రెబ్బెన, డిసెంబర్ 6 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థిని తాళ్లపల్లి ఝాన్సీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని మైదానంలో జరిగిన జోనల్‌స్థాయి అండర్-17 పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లోని మినీ స్టేడియంలో 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రజిత, పీఈటీలు స్వరూప, రజిత, ఉపాధ్యాయులు అభినందించారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

పెంచికల్ పేట్, డిసెంబర్ 6 : మండలంలోని గుంట్లపేటలో అంగన్‌వాడీ కేంద్రం భవనం మంజూరవగా, శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ చంద్రమౌళితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల పక్కనగల స్థలంలో నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 6 : వన్యప్రాణుల సంరక్షణ, పక్షుల జీవన విధానం, పక్షుల వల్ల కలిగే ప్రయోజనాలపై చెన్నూర్ ఎఫ్ఆర్వో శివకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిష్టంపేటలోని అంబేద్కర్ అర్బన్ పార్కులో చెన్నూర్‌లోని అసిసి పాఠశాలకు చెందిన విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ఎకో పార్కు ఎదుట విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటవీశాఖ సిబ్బంది

యువతి ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తి అరెస్ట్

అరెస్ట్ చూపుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, డిసెంబర్ 6 : బెల్లంపల్లి పట్టణంలోని హన్మాన్‌బస్తీకి చెందిన సాయిస్నేహిత(24) ఆత్మహత్యకు కారకుడైన మహ్మద్‌ఖాసీంబస్తీకి చెందిన శ్రీనాథ్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. హన్మాన్‌బస్తీకి చెందిన శేషగిరి-లత దంపతులకు ఇద్దరు కూతుళ్లు సాయి శ్వేత, సాయి స్నేహిత (24). శేషగిరి పట్టణంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. సాయిస్నేహిత, ఆంధ్రాబ్యాంక్ లైన్‌లో బేకరీ నిర్వహిస్తున్న శ్రీనాథ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల వివాహం చేసుకోవాలని సాయిస్నేహిత పట్టుబట్టింది. కులం తక్కువని, వివాహం చేసుకోనని తప్పించుకుతిరిగాడు. మనస్థాపానికి గురైన సాయి స్నేహిత ఈ నెల 2న సాయంత్రం ఇంట్లో ఉరేసుకున్నది. గమనించిన అక్క సాయిశ్వేత కిందికి దించి పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు, అక్కడి నుంచి వంద పడకల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల దవాఖానకు తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. తండ్రి శేషగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేసినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడు శ్రీనాథ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

విజయవంతం చేయాలి

సిర్పూర్(యూ), డిసెంబర్ 6 : ఈ నెల 9న నిర్వహించనున్న చలో ఇంద్రవెల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ కోయ పుణ్యం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కుమ్రం భీం విగ్రహం వద్ద శుక్రవారం జై ఆదివాసి, ఆదివాసీ ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్ర భీంరావ్, నాగోరావ్, రోహిదాస్, సెడ్మకి బాపురావ్ పాల్గొన్నారు.

డీఎఫ్‌వోను కలిసిన జీఎం

డీఎఫ్‌వోకు మొక్కను అందజేస్తున్న జీఎం

శ్రీరాంపూర్, డిసెంబర్ 6 : శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ శుక్రవారం మంచిర్యాల జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ శివ్ అశీష్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి ఆధీనంలో ఉన్న అటవీ భూములపై కూలంకసంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

బంగారం అప్పగింత

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 6 : పోగొట్టుకున్న బంగారాన్ని బాధితుడికి అప్పగించి మానవత్వాన్ని చాకుటుకున్నారు చెన్నూర్ తపాలా కార్యాలయ సిబ్బంది. చెన్నూర్ మండలం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన ఈర బోయిన సమ్మయ్య.. ముతూట్ ఫైనాన్స్‌లో తనకా పెట్టిన తులం బంగారాన్ని విడిపించుకున్నాడు. పని నిమిత్తం సమ్మయ్య చెన్నూర్‌లోని పోస్ట్ ఆఫీస్‌కు వచ్చాడు. తన వద్ద ఉన్న బంగారం పోస్టు ఆఫీసులో పోగొట్టుకున్నాడు. గమనించిన భీమిని రాజాగౌడ్.. బాధితుడికి సమాచారం అందించి, అప్పగించారు. బ్రాంచ్ పీఎం గుర్రం మహేశ్ ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

చింతలమానేపల్లి, డిసెంబర్ 6 : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్ స్టేషన్ పనులను జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ పీ వెంకటేశ్వర్ రావు, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ డీఈ నాగరాజు పేర్కొన్నారు. రవీంద్రనగర్ సమీపంలోని చింతలపాటి వద్ద నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను శుక్రవారం పరిశీలించారు. కౌటాల ఏడీఈ రాజేశ్వర్ ఉన్నారు.